క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణాధ్యక్షుడు చంటి, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్‌మోన్, ప్రమీలమ్మ, రమాదేవి, సీతమ్మ, శాంతి, రాణి, రవణమ్మ, ఎలీషా, రమేష్, దావీదు, మహేష్, థామస్, మేరి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా వరప్రసాదరావు బాధ్యతల స్వీకరణ



ఎంపీడీఓను సత్కరించిన కార్యదర్శులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ఎంపీడీఓగా సోమవారం వరప్రసాదరావు బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా డోన్ నుంచి ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రమౌళి బద్వేలుకు బదిలీపై వెళ్లారు. పంచాయతీ కార్యదర్శులు ఆయనకు స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సత్కరించారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి



దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీనివాసులు

పోరుమామిళ్ల : స్వాతంత్ర్య సమరయోధుడు, భారతీయ జనతా పార్టీలో ప్రధాన భూమిక పోషించిన పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ జయంతిని సోమవారం ఇందిరానగర్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ బద్వేలు అసెంబ్లీ ఇన్‌చార్జి ఉట్టి శ్రీనివాసులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ 1916 సెప్టెంబర్ 25న పుట్టిన దీన్‌దయాల్ స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారన్నారు. 1965లో ఏకాత్మత మానవతా వాద సిద్ధాంతం రూపొందించారన్నారు. బీజేపీ ఈనాడు ఇంత గొప్పస్థాయిలో ఉండటానికి పునాది వేశారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాలకృష్ణ, పీరయ్య, జగన్, మహిళలు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

అట్లూరు : ఆటల పోటీల్లో అట్లూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల స్పెషలాఫీసర్ ఫణిశ్రీ, పీఈటీ ప్రమీల తెలిపారు. అండర్–19 ఆటల పోటీల్లో భాగంగా సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ విభాగాల్లో పుల్లంపేట మోడల్ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి ఆటల పోటీల్లో 5 మంది విద్యార్థినులు సాఫ్ట్‌బాల్‌కు, మరో ఐదుగురు విద్యార్థినులు బేస్‌బాల్‌కు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పాఠశాలకు చెందిన పి.హారిక మూడవ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించిందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను వారు అభినందించారు.

బి.ఎస్.ఎన్.రెడ్డికి గుర్రంజాషువా జీవన సాఫల్య పురస్కారం



పురస్కారం అందజేస్తున్న డాక్టర్ సరోజనమ్మ తదితరులు

కాశినాయన : మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన ఆర్ట్ ఆఫ్ లివ్వింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డికి అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ సరోజనమ్మ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో గుర్రంజాషువా జీవన సాఫల్య పురస్కారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సినీ హాస్యనటులు సుదర్శన్, డాక్టర్ సరోజనమ్మలు మాట్లాడుతూ చిన్నతనంలోనే సంఘసేవకుడిగా ముద్ర వేసుకుని పలు సామాజిక కార్యక్రమాలు చేస్తున్న బి.ఎస్.నారాయణరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో సినీనటులు పద్మావతి, అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్, గౌతమ్, టీవీ ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్ రామ్‌కుమార్, డాక్టర్ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి

మైదుకూరు : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం.. ఆడ పిల్లలకైనా, మగ పిల్లలకైనా పెళ్లీడు వచ్చాకే వారికి వివాహం చేయాలని మైదుకూరు మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాలను ప్రోత్సహించే వధూవరుల తల్లిదండ్రులు, సంరక్షకులు, ఇరుగుపొరుగువారు, వివాహం కుదిర్చిన మ్యారేజీ బ్యూరోలు, క్యాటరింగ్ నిర్వాహకులు, వీడియో గ్రాఫర్లు కూడా శిక్షార్హులేనన్నారు. బాల్య వివాహాల గురించి తెలియగానే కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎవరికైనా సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ చిన్న వయసులోనే ఆడ పిల్లలకు వివాహం చేయడం వల్ల వారు రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాల వల్ల ఆడ పిల్లల పెరుగుదలలేని అనారోగ్య శిశువులను జన్మనిచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో బాల్య వివాహాలను అరికట్టడంలో తాము భాగస్వాములం అవుతామంటూ పట్టణానికి చెందిన కల్యాణ మండపాల యజమానులు, దేవాలయాలు, షాదీఖానాలు, చర్చిల నిర్వాహకులతో ప్రమాణం చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

చాపాడు: 18 ఏళ్ల నిండక ముందే ఆడవారికి బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట, కేతవరం గ్రామాల్లో ఇటీవల చిన్న వయస్సులో వివాహం చేసుకున్న మహిళలకు కుటుంబీకులతో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళా పోలీసు ప్రసన్న సమావేశమయ్యారు. చిన్న వయస్సులో వివాహం చేయరాదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆడ పిల్లలను చదివించేందుకు అన్ని విధాలు ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు భారతి, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయండి



బ్యాడ్మింటన్ ఆటను ప్రారంభిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి

గోపవరం : అక్టోబర్ 2 నుంచి ప్రభుత్వం నిర్వహించే ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నగోపవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలికల బ్యాడ్మింటన్ ప్రాక్టీస్‌ను ఆయన ప్రారంభించారు. 15 సంవత్సరాలు పైబడిన వారందరూ క్రీడల్లో పాల్గొనవచ్చని, ఇప్పటికే ఆయా సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారి వివరాలను సేకరించి ప్రాక్టీస్ మొదలుపెట్టాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ సిబ్బందితోపాటు అన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయం



మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటరమణ

గోపవరం : తొలి తెలుగు రామాయణ కవయిత్రి మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని తెలుగుభాష సంరక్షణ సమితి జిల్లా సహాయక కార్యదర్శి గంగనపల్లె వెంకటరమణ, గోపవరం తెలుగు ఉపాధ్యాయుడు పైడి నాగసుబ్బయ్యలు పేర్కొన్నారు. ఇందుకోసం మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు, శాలివాహన సంఘం చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. సోమవారం ఉదయం హరిత టూరిజం రెస్టారెంట్ ఆవరణలో ఉన్న మొల్ల విగ్రహాన్ని వారు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 వేల శ్లోకాలతో కూడిన సంస్కృత రామాయణాన్ని కేవలం 871 పద్యగద్యాలతో సంపు కావ్యంగా మొల్ల రామాయణాన్ని రచించి తెలుగు సాహితీ చరిత్రలో మొల్ల చిరకీర్తిని సంపాదించుకున్నారని వారు ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు హైమావతి, సాహితీపీఠం సభ్యులు శ్రీనివాసులు, చిన్న నరసింహులు, సుబ్బలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకే సేవలను సద్వినియోగం చేసుకోండి



వ్యవసాయాధికారులతో చర్చిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

గోపవరం : రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. డివిజన్ పరిధిలోని బద్వేలు, సిద్దవటం, అట్లూరు, గోపవరం మండలాలకు సంబంధించి వర్షపాతం, పంటల వారీగా సాగు విస్తీర్ణం, రైతుభరోసా కేంద్రాల సేవలు, ఈ–పంట నమోదు, ఎరువులు తదితర అంశాలపై వ్యవసాయాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ నెలాఖరుతో ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నందున ఇప్పటి వరకు ఆశించిన పంటలు రైతులు సాగు చేయలేదని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ సలహాదారులకు వివరించారు. అక్టోబర్ 1 నుండి రబీ సీజన్ ప్రారంభమవుతున్నందున చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు విజ్ఞప్తి చేశారు. చిరుధాన్యాలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించిన విషయాన్ని రైతులకు వివరించి పంటలు సాగు చేసేవిధంగా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ–పంట నమోదు ప్రక్రియను ఈ నెల చివరిలోపు పూర్తి చేయాలన్నారు. గోపవరం, అట్లూరు మండలాల్లో రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటికే చిరుధాన్యాల సాగుపై అన్ని ఆర్బీకేల పరిధిలో గ్రామసభలు పెట్టి రైతులకు అవగాహన కల్పించామన్నారు. సమీక్షలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పోటీలో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ కళాశాలలో సోమవారం నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. బాలబాలికలకు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగుపోటీ, లాంగ్‌జంప్, హైజంప్, పోల్‌వాల్ట్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్, డిస్కస్‌త్రో విభాగాలలో పోటీలు జరిగాయి. నియోజకవర్గంలోని ప్రొద్దుటూరు, రాజుపాళెంకు చెందిన పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యంతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాదరెడ్డి, షేక్‌బాబు, ఓబయ్య, సుబ్బయ్య, శామ్యూల్ తదితరులు పర్యవేక్షించారు.

ఎంపీని విమర్శించే అర్హత భాస్కర్‌రెడ్డికి లేదు



మాట్లాడుతున్న ఏవీ సుబ్బారెడ్డి

మైదుకూరు : వార్డు సభ్యునికి ఎక్కువ, సర్పంచ్ పదవికి తక్కువ అయిన శివపురం సర్పంచ్ కొండా భాస్కర్ రెడ్డికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని మైదుకూరు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీని వీడి సోమవారం టీడీపీలో చేరిన శివపురం సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. సోమవారం సాయంత్రం ఆయన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, అన్నలూరు సర్పంచ్ ఎం.శ్రీనివాసులురెడ్డి, దయాంఖాన్‌పల్లె పంచాయతీ ఇన్‌చార్జి మల్లికార్జునరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొండా భాస్కర్‌రెడ్డి శివపురం సర్పంచ్‌గా ఎన్నికయ్యారంటే అది ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చలువేనన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ తరపున తన బంధువు సుబ్బారెడ్డి అభ్యర్థిగా ఉన్నా, ఎమ్మెల్యే ఆదేశం మేరకు పార్టీ నియమానుసారం భాస్కర్‌రెడ్డి గెలుపునకు కృషి చేశామని తెలిపారు. అయితే సర్పంచ్ పదవిని అడ్డం పెట్టుకొని భాస్కర్‌రెడ్డి రెండేళ్లపాటు శివపురం చెరువు మట్టిని తోడి రూ.లక్షలు సంపాదించాడని ఆరోపించారు. శివపురం సమీపంలోని శ్మశానం పేరు చెప్పి దళితులకు చెందిన ఎకరా స్థలాన్ని ఆక్రమించి భాస్కర్ రెడ్డి ప్లాట్లు వేసి అందులో తాను ఇల్లు కట్టుకోవడమేగాక, ఆయన బంధువులకు కూడా పంచి పెట్టాడని ఆరోపించారు. శివపురం దళితులకు శ్మశానం ఏర్పాటు విషయంలో రెండు వర్గాల మధ్య విభేదాలు రావడంతో భాస్కర్‌రెడ్డి ఒక వర్గానికి మద్దతు తెలుపుతూ మరో వర్గంపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టించారన్నారు. తాను స్టేషన్‌లో ఇరు వర్గాలను రాజీ చేయగా ఆ విషయం నచ్చని భాస్కర్‌రెడ్డి తనపై కినుక వహించారన్నారు. పంచాయతీలో డ్రెయిన్స్ నిర్మించిన భాస్కర్‌రెడ్డికి, ఎమ్మెల్యే మండల నిధుల నుంచి రూ.7లక్షలు ఇప్పించారని పేర్కొన్నారు. డీలర్ షిప్, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం, జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఎంపిక అన్నీ భాస్కర్‌రెడ్డి ఇష్టానుసారమే జరిగాయని తెలిపారు. అయినా భాస్కర్‌రెడ్డి టీడీపీలోకి వెళ్లిపోవడం వల్ల వైఎస్సార్‌సీపీకి నష్టమేమి లేదన్నారు. ఆయన వచ్చేవారెవరూ లేరని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. విజయవాడలో అంగన్‌వాడీలు, సంఘం నాయకుల అరెస్టుకు నిరసనగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుండా అంగన్‌వాడీలను, సంఘం నాయకులను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, సునీత, నాగలక్ష్మి, రాజీ, సువార్తమ్మ, నాగవేణి, నాగేశ్వరి, రామసుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

బి.కోడూరు : మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, నాబార్డు వారి సౌజన్యంతో కళాసేన రూరల్ మీడియా బృందంతో సోమవారం మండలంలోని రామచంద్రాపురం, కాసానగరం వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత అవసరమన్నారు. ప్రతి ఒక్కరు ప్రధానమంత్రి ఇన్సూరెన్స్ పథకాలు కలిగి ఉండాలని, సహజ మరణం, ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినప్పుడు కుటుంబానికి రూ.2 లక్షలు వర్తిస్తాయని వివరించారు. ఆన్‌లైన్ స్కాం, మోసాలు జరిగినప్పుడు వెంటనే బ్యాంక్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీబీ బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజుపాళెం ఎంపీడీఓగా వెంకటరెడ్డి



రాజుపాళెం : రాజుపాళెం మండల ఎంపీడీఓగా జీజే వెంకటరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిస్తున్న సయ్యదున్నీసా పదోన్నతిపై నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండల ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా వెలుగోడు మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న జీజే వెంకటరెడ్డి పదోన్నతిపై ఎంపీడీఓగా రాజుపాళెం వచ్చారు. ఆయనను ఈఓపీఆర్డీ షాకీర్ అలీఖాన్, ఏపీఓ గంగయ్య, ఎంఈఓలు క్రిష్టఫర్, రామస్వామిరెడ్డి, ఈసీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

28న శ్రీ అనంత పద్మనాభుని కల్యాణోత్సవం

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని పాత కడపలోగల శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎ.శ్రీధర్, ధర్మకర్త కె.సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్‌లు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 7.00 గంటలకు స్వామి మూలమూర్తికి విశేష అభిషే కం, 8.30 గంటలకు విశేష అలంకారం, సర్వదర్శనం ఉంటాయన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

27న పర్వతారోహకుల పరిచయం

కడప కల్చరల్ : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఇద్దరు పర్వతారోహకుల పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కేంద్రం సంచా లకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి వైవీ యూ వీసీ ఆచార్యచింతా సుధాకర్ ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ ఆచార్యవైపీ వెంకట సుబ్బ య్య విశిష్ట అతిథిగా హాజరవుతారన్నారు.

చదరంగం పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కడప స్పోర్ట్స్: నెల్లూరు నగరంలో నిర్వహించిన వై.వి.ఆర్ మెమోరియల్ జాతీయస్థాయి చదరంగం పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన క్రీడాకారులు రాణించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. ఈనెల 24న నిర్వహించిన పోటీల్లో ప్రొద్దుటూరుకు చెందిన రేటింగ్ క్రీడాకారిణి సజ్‌జోత్స్న అండర్–15 బాలికల విభాగంలో ప్రథమస్థానం, కడపకు చెందిన జ్యోతి రెండోస్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదే విధంగా అండర్–11 బాలికల విభాగంలో కడపకు చెందిన చిన్మయి రెండోస్థానం, అండర్–11 బాలుర విభాగంలో ప్రదీప్‌చంద్రారెడ్డి 4వ స్థానం, అండర్–7 విభాగంలో కడపకు చెందిన అమీనా 4వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కడప కార్పొరేషన్: ఔట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియ న్ నగర అధ్యక్షుడు సుంకరి రవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడు తూ కోవిడ్–19లో తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. పీహెచ్ డ్రైవర్లకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, అడిషనల్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వర్తింప జేయాలన్నారు.

బొజ్జ గణపయ్యా.. ఇక సెలవయ్యా..



వసంతపేటలో నృత్యం చేస్తున్న మహిళలు



దేవాంగపేటలో నిమజ్జనానికి తరలిన శివగణపతి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాలలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను సోమవారం గణపతి ఉత్సవ కమిటీ వారు నిమజ్జనానికి తరలించారు. ఉదయం ఏకదంతునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ట్రాక్టర్, లారీలలో విగ్రహాలను ఎక్కించి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి కుందూ నదిలో నిమజ్జనం చేశారు. గ్రామోత్సవంలో కేరళ సింగారిమేళం, డప్పువాయిద్యాల సందడి, బాణసంచా పేలుళ్లు, చెక్కభజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు రంగులు చల్లుకుంటూ జైబోలో గణేష్ మహారాజ్ అంటూ నినాదాలు చేస్తూ గ్రామోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కొందరు గణపతి ఉత్సవ కమిటీ వారు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఉట్టి కొట్టే కార్యక్రమం ఆనందోత్సాహాలతో జరిగింది. శ్రీరాంనగర్ శివపుత్ర యూత్ కమిటీ వారు ఏర్పాటు చేసిన గణపతి చేతిలోని లడ్డూ వేలం పాటలో రూ.2లక్షలకు మాడిశెట్టి వీరభాస్కర్ చేజిక్కించుకున్నారు. సోమవారం పట్టణంలోని చాలా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.



కేరళ సింగారిమేళం

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



క్రీడా దుస్తులు ధరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళ, బుధవారాల్లో నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో ఇది వరకే నిర్వహించిన మండల స్థాయి పోటీల్లో ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

బద్వేలు అర్బన్ : నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీల్లో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి. సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ చాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు విజయకుమార్‌రెడ్డి, రమేష్‌రాజాలు రూ.20 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వాడవాడలా సిమెంటు రోడ్లు, కాలువలు



8వ వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో వాడవాడలా సిమెంటు రోడ్లు, కాలువలను నిర్మిస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. 8వ వార్డు పరిధిలోని వీధుల్లో సోమవారం ఉదయం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు తమకు నీటి సమస్య లేదని, నీరు బాగా వస్తోందని వైస్ చైర్మన్‌కు తెలిపారు. వీధి లైట్ల సమస్య తెలపడంతో అప్పటికప్పుడే ఏర్పాటు చేయించారు. ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా దాదాపు రూ.30 లక్షలతో వార్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాగుల శాంతి, వార్డు నాయకులు మాధవ, చిన్న ఓబులేసు, హరినారాయణ, కళ్యాణ్, పెద్దిరాజు, పుల్లయ్య, నాగేంద్ర, కిరణ్, రవీంద్ర పాల్గొన్నారు.

కరెంట్ ఖాతా వ్యాపారులకు ఉపయోగకరం



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : అధిక మొత్తంలో లావాదేవీలు అవసరమైన వ్యాపారస్తులకు కరెంట్ ఖాతా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో కరెంట్ ఖాతా కౌంటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కరెంట్ ఖాతా తెరవడం వలన అత్యవసర పరిస్థితుల్లో బ్యాంకు నిర్ణీత పరిమితి వరకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం అందిస్తుందని తెలిపారు. బద్వేలు లాంటి అభివృద్ధి చెందుతున్న పట్టణంలో వ్యాపారస్తులను ప్రోత్సహించేందుకు బ్యాంకులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ రమేష్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పుత్తా శ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.